జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ‖సంపుటి:1 ‖ సంచిక: 64‖ శుక్రవారం ‖ 31-7-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

31 జూలై 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాడ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:58 సూర్యాస్తమయం - సా. 6:46 తిథి విదియ రా. 10:29 వరకు తరువాత తదియ సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం ధనిష్ఠ రా. 7:15 వరకు తరువాత శతభిష యోగం సౌభాగ్య రా. 11:50 వరకు కరణం తైతుల ఉ. 10:02 వరకు గరజి రా. 10:29 వరకు వర్జ్యం తె. 3:01 నుండి తె. 4:42 వరకు దుర్ముహూర్తం ఉ. 8:32 నుండి ఉ. 9:23 వరకు మ. 12:48 నుండి మ. 1:39 వరకు రాహుకాలం ఉ. 10:46 నుండి మ. 12:22 వరకు యమగండం మ. 3:34 నుండి సా. 5:10 వరకు గుళికాకాలం ఉ. 7:34 నుండి ఉ. 9:10 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:22 నుండి తె. 5:10 వరకు అమృత ఘడియలు ఉ. 8:17 నుండి ఉ. 10:00 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున






## ఐటీఆర్ ఫైలింగ్‌కు
# నేడే ఆఖరు

**ఆలస్యమైతే రూ. 5,000 ఫైన్**

**ఇప్పటికి 5 కోట్ల రిటర్న్స్ దాఖలు**

ఆదాయపు పన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలుకు గడువు సమీపిస్తోంది. ఆడిట్ అవసరం లేని పన్ను చెల్లింపు దారులు 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి గాను జులై 31లోగా తమ రిటర్నులను సమర్పించాల్సి ఉంది. ఈ గడువు ముగియడానికి మరో ఒక్క రోజు మాత్రమే సమయం మిగిలి ఉంది.

న్యూఢిల్లీ: నిర్ణీత గడువులోగా ఐటీఆర్ దాఖలు చేయడంలో విఫలమై తే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత సమయంలోగా ఐటీఆర్ ఫైల్ చేయని వారు ఆలస్య రుసుము చెల్లించి, డిసెంబర్ 31, 2026 వరకు తమ రిటర్నులను సమర్పించవచ్చు. నిబంధనల ప్రకారం, వార్షిక తరువాయి 2 వ పేజీలో...



## తెలంగాణ విద్యారంగం
# బలోపేతానికి కృషి



**కార్పోరేట్‌కు దీటుగా పాఠశాలల అభివృద్ధి**

**పిల్లల భవిష్యత్ తీర్చి దిద్దేందుకే విద్యాశాఖ చూస్తున్నా**

**పిల్లలను హాస్టళ్లలో వేయడంతో దెబ్బతింటున్న బంధాలు**

**మండలం క్లస్టర్‌గా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నాం**

**ఉపాధ్యాయుల పదోన్నతలపై అనుమానాలు వద్దు**

**2034 వరకు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా: రేవంత్**

హైదరాబాద్,జూలై30 : తెలంగాణను విద్యాపరంగా అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్కూళ్లను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతు న్నామని అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తరువాయి 2 వ పేజీలో..

## గొడ్డలి పార్టీ జగన్ రెడ్డికి
# ఇంగిత జ్ఞానం లేదు

**నేర ఆరోపణలు ఎదుర్కొంటోన్న వ్యక్తికి పరామర్శ**

**గొడ్డలి పార్టీ అంటేనే అసభ్య చేష్టల పార్టీ**

**జగన్ రెడ్డికి ములాఖత్ నిబంధనలు తెలియవా**

**సొంత చెల్లిని పరామర్శించని వాడు సమాజం గురించి మాట్లాడడం విడ్డూరం: మంత్రి కొండపల్లి**

విజయనగరం, జూలై 30 : బాధితులకు అండగా నిలవాల్సింది పోయి, నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిని పరామర్శించడం గొడ్డలి పార్టీ అధినేత వైఎస్. జగన్ రెడ్డికే చెల్లిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. గొడ్డలి పార్టీకి చెందిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు యాక్సిడెంట్‌లో ప్రాణం పోయిన దానయ్య కుటుంబాన్ని పరామర్శించాలన్న ఇంగిత జ్ఞానం జగన్ రెడ్డికి లేకపోవడం బాధాకరం అని మంత్రి వాపోయారు. జైలులో ఉండి వచ్చిన గొడ్డలి పార్టీ అధినేతకు ములాఖత్ నిబంధనలు తెలియవా... నిర్ణీత సమయంలో కలవకుండా.. శ్రీకాకుళం పర్యటనలో కేవలం బల ప్రదర్శన చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చేశారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడ్డలి పార్టీ నాయకులు విధుల్లో ఉన్న మహిళా పోలీసు అధికారులతో అసభ్య ప్రవర్తన, దాడులకు ప్రేరేపించడమేనా మీ గొడ్డలి పార్టీ కార్యకర్తలకు తరువాయి 2 వ పేజీలో...



**'పేపర్ లీక్' బిల్లుకు పార్లమెంట్ ఆమోదం**



## వేములవాడ బస్‌స్టేషన్‌కు
# కొత్త రూపు

**రూ.1.62 కోట్లతో ఆధునీకరణ పనులకు శ్రీకారం**

**కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం**

**మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలవుతోందన్న మంత్రి**

**ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి**

రాజన్న సిరిసిల్ల, జూలై 30: మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం సమర్థ వంతంగా అమలు చేస్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ--కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా (మిగతా 2వ పేజీలో)




## రాజధాని ఎక్కడో చెప్పకుండా
# పంపించేశారు

## ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

కర్నూలు,జూలై30: రాష్ట్ర విభజన సమయంలో రాజధాని ఎక్కడో చెప్ప కుండా మనల్ని గెంటేశా రని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆ కసితోనే రాష్ట్రంలో అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నా మని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. కర్నూలులో లోకేశ్ మాట్లాడుతూ.. ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయని అంటే అందులో ఆ శాఖ మంత్రి టీజీ భరత్ కృషి ఎంతో -2 వ పేజీలో..



## క్షేత్రస్థాయిలో అధికారులు
# అప్రమత్తంగా ఉండాలి

**కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

హైదరాబాద్, జూలై 30:
రాష్ట్రంలో గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రహదారులు, వంతెనల పరిస్థితిపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, రోడ్లు--భవనాల శాఖ డివిజన్ల వారీగా రహదారులు, వంతెనలు, లోకాజ్ వేలు, కల్వర్టుల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముంపునకు (మిగతా 2వ పేజీలో)

# వరదలపై మోదీ సమీక్ష

**అరుణాచల్, నాగాలాండ్ ఎంపీలతో సమావేశం.. రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం పూర్తి సహకారం**

న్యూఢిల్లీ, జూలై 30: అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాల్లో కొనసాగుతున్న వరద పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఆ రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులతో సమావేశమయ్యారు. ఇటీవలి భారీ వర్షాలు, వరదల ప్రభావంతో ఏర్పడిన పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సహాయక చర్యల పురోగతిపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. వరదల కారణంగా ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు తక్షణ సహాయం (మిగతా 2వ పేజీలో)



# నిరుద్యోగుల మెరుపు ధర్నా

**వర్షాన్నీ లెక్క చేయకుండా తరలిన ఉద్యోగార్థులు**

**అన్ని పోస్టులకు నోటిఫికేషన్ ఇయ్యాలె**

**19,000 పోలీస్ నియామకాలు చేపట్టాలె**

**వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలె**

**రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్లు**

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు మరోసారి ఆందోళన బాట పట్టారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్, చిక్కడపల్లి ప్రాంతాల్లో భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిరుద్యోగులు మెరుపు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 19,000 పోలీస్ పోస్టులతో నియామక నోటిఫికేషన్ విడుదల చేయాలని, అలాగే ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ట వయోపరిమితిని సడలించాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న అభ్యర్థులు మెగా డీఎస్సీ, గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

2

# తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి

**మొదటి పేజీ తరువాయి**

విద్యారంగాన్ని పూర్తిస్థా యిలో బలోపేతం చేసేందుకే రాష్ట్ర బడ్జెట్‌లో ఏకంగా 9 శాతం నిధులను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఓట్ల రాజకీయం కోసం కాకుండా, పిల్లల బంగారు భవిష్యత్తును దిద్ది తీర్చాలనే ఏకైక లక్ష్యంతోనే విద్యాశాఖ బాధ్యతలను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. గతంలో ఉన్నవారు ఇరిగేషన్ శాఖను ఎంచుకుంటే, నేను విద్యాశాఖ బాధ్యతను నా వద్దే ఉంచుకున్నా. 80 వేల పుస్తకాలు చదివానన్న నాయకుడి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. కానీ నా ప్రాధాన్యత ప్రాజెక్టులు కావు, పిల్లల చదువులే అని సీఎం అన్నారు. లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నా, ఉద్యోగానికి దరఖాస్తు రాసుకోలేని పరిస్థితి రాకూడదని, విద్యా ప్రమాణాలను పెంచడమే తమ నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే పిల్లలను హాస్టళ్లలో వేయడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బ తింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరిగా పెరిగే పిల్లలు పెద్దయ్యాక తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులే తల్లిదండ్రుల స్థానంలో ఉండి పిల్లలకు సరైన మార్గదర్శనం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయంగా, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకుని విద్యా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. విద్యాబోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ఏటా 10 నుండి 12 మంది ఉపాధ్యాయులను 'స్టడీ లీవ్'పై విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీల బాధ్యతను తానే చూసుకుంటానని, అడగకుండానే ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు. ఇదే క్రమంలో తన రాజకీయ ప్రస్థానంపై స్పందిస్తూ 2034 వరకు నేనే సీఎంగా ఉంటాను, ఎలాంటి సందేహాలు వద్దని ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎవరూ ఎలాంటి అనుమానాలు, డౌట్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల బృందంతో ఇవాళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్వహణలో తాము మానవత్వంతో వ్యవహరిస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన సీఎం, వారి సమస్యల పరిష్కార బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రమోషన్లు, బదిలీలు ఇంటికే వస్తాయని, ఉపాధ్యాయులు కేవలం విద్యార్థుల భవిష్యత్తు, బడులలో సౌకర్యాల పైనే దృష్టి పెట్టాలని కోరారు. ఐఏఎస్ అధికారులనైనా సులభంగా బదిలీ చేయవచ్చని, కానీ టీచర్ వ్యవస్థ అత్యంత శక్తివంతమైనదని కొనియాడారు. బడులలోని పిల్లల సమస్యలపై తనతో చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. 'ప్రభుత్వ బడులలో చదివితే ఏం అవుతావు?' అని ఎవరైనా అడిగితే, 'తెలంగాణ సీఎం అవుతాను' అని పిల్లలు ధైర్యంగా చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను స్వయంగా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ఎలాంటి మంత్రి పదవి అనుభవం లేకపోయినా ఈరోజు సమర్థవంతంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నానని గుర్తుచేశారు. ఇటీవల తాను హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని చెబుతూ, కేవలం తెలివి ఉంటే సరిపోదని, క్రమశిక్షణెళి మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని నొక్కి చెప్పారు.

# నేటి రాశి ఫలాలు

**మేషం :** మిశ్రమ ఫలితాలు ఉన్నప్పటికీ ధైర్యంగా ముందుకు సాగితే ఆటంకాలను అధిగమిస్తారు. బంధుమిత్రులతో సత్సంబంధాలు కొనసాగించడం మేలు చేస్తుంది. మాటల్లో సంయమనం పాటిస్తే ప్రయోజనం ఉంటుంది. నవగ్రహ శ్లోకాల పఠనం శుభప్రదం.

**వృషభం :** గ్రహబలం అనుకూలంగా ఉండి కృషికి తగిన ఫలితాలు లభిస్తాయి. మీ ప్రతిభకు ప్రశంసలు అందుతాయి. ముఖ్యమైన పనుల్లో విజయం సాధిస్తారు. ఇష్టదైవ ధ్యానం శుభప్రదం.

**మిథునం :** ఉద్యోగ, వ్యాపార రంగాల్లో అనుకూల అవకాశాలు లభిస్తాయి. ఉత్సాహంగా ప్రారంభించిన పనులు సత్ఫలితాలను ఇస్తాయి. స్నేహితులు, బంధువులతో ఆనందంగా గడుపుతారు. శ్రీఆంజనేయ స్వామి ఆరాధన మేలు చేస్తుంది.

**కర్కాటకం :** పనిభారం పెరిగే అవకాశం ఉన్నందున ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. కుటుంబ సభ్యుల సూచనలు మేలు చేస్తాయి. అనవసర విభేదాలకు దూరంగా ఉండటం మంచిది. నవగ్రహ శ్లోకాల పఠనం శుభప్రదం.

**సింహం :** ప్రణాళికతో ముందుకు సాగితే ఆశించిన విజయాలు సాధిస్తారు. వృత్తి రంగంలో కొత్త అవకాశాలు కలిసి వస్తాయి. మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. గణనాయకాష్టకం పఠించడం శ్రేయస్కరం.

**కన్య :** పెద్దల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. చిన్నచిన్న ఆటంకాలు ఎదురైనప్పటికీ పట్టుదలతో అధిగమిస్తారు. ఖర్చుల విషయంలో మితవ్యయం పాటించడం మంచిది. హనుమాన్ చాలీసా పఠించడం శుభప్రదం.

**తుల :** ఆత్మవిశ్వాసంతో ప్రారంభించిన పనులు విజయవంతం అవుతాయి. అవసరమైన సమయంలో తగిన సహకారం లభిస్తుంది. బంధుమిత్రులతో అనుబంధం మరింత బలపడుతుంది. ఇష్టదైవారాధన శుభప్రదం.

**వృశ్చికం :** ప్రారంభించిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. ఆర్థికంగా అనుకూల ఫలితాలు పొందుతారు. దక్షిణామూర్తి స్తోత్రం పఠించడం మేలు చేస్తుంది.

**ధనుస్సు :** మీ తెలివితేటలు అందరినీ ఆకట్టుకుంటాయి. కుటుంబానికి సంబంధించిన ఒక శుభవార్త ఆనందాన్ని కలిగిస్తుంది. మానసికంగా ఉత్సాహంగా ఉండి పనులు పూర్తి చేస్తారు. ఇష్టదైవారాధన శ్రేయస్సును ప్రసాదిస్తుంది.

**మకరం :** అవసరమైన సమయంలో సహాయం లభిస్తుంది. బంధుమిత్రుల సూచనలు పాటిస్తే సమస్యలు దూరం అవుతాయి. ఖర్చులను నియంత్రించుకొని ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలి. శివారాధన శుభప్రదం.

**కుంభం :** దైవబలంతో ప్రారంభించిన పనులు విజయవంతం అవుతాయి. బుద్ధిబలంతో తీసుకునే నిర్ణయాలు మేలు చేస్తాయి. ఆర్థిక సంబంధ వ్యవహారాల్లో జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం. నవగ్రహ శ్లోకాల పఠనం శుభప్రదం.

**మీనం :** అనుకూల పరిస్థితులు ఏర్పడి మనఃశ్శాంతి, సంతోషం లభిస్తాయి. వృత్తి, వ్యాపార రంగాల్లో లాభదాయకమైన అవకాశాలు కనిపిస్తాయి. కుటుంబ సభ్యులతో ఆనందంగా సమయం గడుపుతారు. ఇష్టదేవత ఆరాధన శుభప్రదం.



## రాజధాని ఎక్కడో చెప్పకుండా
# పంపించేశారు

**మొదటి పేజీ తరువాయి**

ఉందని తెలిపారు. ఓ పట్టుదలతో తామంతా పనిచేస్తున్నామని అన్నారు. రిలయన్స్, ఫార్మాతోపాటు ఇతర పరిశ్రమలు కర్నూలు జిల్లాకు వస్తున్నాయని ఆయన వివరించారు. పట్టుదలతోపాటు క్రమశిక్షణతో పనిచేయాలని ఈ సందర్భంగా యువతకు మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ మూడు నెలల్లో (90 రోజుల్లో) వస్తుందని ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. గతంలో తాను చేపట్టిన యువగళం పాదయాత్రలో తనను పత్తికొండలో పోలీసుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేశారని.. కానీ ప్రజలు, కార్యకర్తలు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం.. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని భారీగా పరిశ్రమలు తీసుకొస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సోలార్ ప్రాజెక్టులు వస్తుంటే రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూనిట్‌పై రూ.13 పైసలు తగ్గించామన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో ఉంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఇదిలావుంటే ఇచ్చిన మాట ప్రకారం ఆదోని చిన్నారుల కోరికను మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. చిన్నారులు సహస్ర ఆద్య, జయ స్కందను కలిసిన మంత్రి వారితో ఫొటో దిగారు. దీంతో చిన్నారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. 'లోకేశ్ సర్ మిమ్మల్ని కలవాలి, మీతో ఫొటో దిగాలని ఉంది' అంటూ ఆదోని చిన్నారుల వీడియో సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేసింది.

# ఐటీఆర్ ఫైలింగ్‌కు నేడే ఆఖరు

**మొదటి పేజీ తరువాయి**

ఆదాయం రూ. 5 లక్షల వరకు ఉన్నవారికి రూ. 1,000, అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారికి రూ. 5,000 వరకు జరిమానా విధిస్తారు. అయితే, ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితి కంటే తక్కువ ఆదాయం ఉన్నవారికి ఈ రుసుము వర్తించదు. కాకపోతే, చెల్లించాల్సిన పన్ను బకాయిలు ఏవైనా ఉంటే, వాటిపై వడ్డీ వర్తిస్తుంది. ఆదాయపు పన్ను శాఖ గణాంకాల ప్రకారం, జులై 29 నాటికి 5.02 కోట్లకు పైగా రిటర్నులు దాఖలయ్యాయి. వీటిలో 4.69 కోట్లు వెరిఫై కాగా, 2.33 కోట్లు ఇప్పటికే ప్రాసెస్ అయ్యాయి. ఇటీవల ఒకే రోజులో దాదాపు 30 లక్షల రిటర్నులు సమర్పించడం గమనార్హం. గడువులోగా రిటర్నులు దాఖలు చేయకపోతే రీఫండ్లు ఆలస్యమవడమే కాకుండా, కొన్ని రకాల నష్టాలను తర్వాతి సంవత్సరాలకు క్యారీ ఫార్వర్డ్ చేసుకునే వెసులుబాటును కోల్పోతారని పన్ను నిపుణులు సూచిస్తున్నారు.

# 'పేపర్ లీక్' బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను, అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-202 6'(యాంటీ పేపర్ లీక్ బిల్లు) కు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు ఇప్పటికే లోక్‌సభ ఆమోదం తెలపగా, తాజాగా రాజ్యసభ కూడా ఆమోదం తెలిపింది. దీంతో పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ఈ బిల్లుకు ఆమోద ముద్ర లభించినట్లయ్యింది. బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేసిన ఆయన.. పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలన్నీ పేపర్ లీకుల సమస్యను ఎదుర్కొన్నాయని మోదీ గుర్తుచేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని పెంచడం, వేగవంతమైన వ్యవస్థలను అమలు చేయడం, పారదర్శకతను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారు. కొత్త చట్టంతో పేపర్ లీక్ ముఠాలపై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# గొడ్డలి పార్టీ జగన్ రెడ్డికి ఇంగిత జ్ఞానం లేదు

**మొదటి పేజీ తరువాయి**

మీరు ఇచ్చే సందేశం అని మంత్రి ప్రశ్నించారు. మహిళా ఎస్సై ప్రవల్లికపై వైసీపీ నేతల దాడి హేయమైన చర్య అని.. గొడ్డలి పార్టీ అంటేనే అసభ్యపార్టీ.. అందుకే మహిళల విషయంలో దారుణంగా ప్రవర్తించారని మంత్రి పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ అధినేత తన పార్టీ పేరు సార్థకం చేసేలా ఎప్పుడూ నేరగాళ్లనే సమర్థిస్తారని... ఆస్పత్రిలో ఉన్న సొంత చెల్లెలిని పరామర్శించలేని వ్యక్తి నేర ఆరోపణలు ఎదుర్కొంటోన్న వారిని పరామర్శించడం రాజకీయ లబ్ధి కోసం ఆడుతోన్న నాటకం కాదా ? అని ప్రశ్నించారు. సొంత కుటుంబానికే విలువ ఇవ్వని వాడు.. సమాజం, ప్రజల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని నిబంధనలు విస్మరిస్తే ఊరుకునేది లేదని... చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రి కొండపల్లి హెచ్చరించారు.

# క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

గుర్తైన ప్రాంతాల్లో రహదారుల రాకపోకలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైన చోట తక్షణమే మ-రమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. కల్వర్టులు, లోకాజ్ వేలు, కోతకు గురైన రహదారుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న రహదారులు, వంతెనల వద్ద కూడా అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రహదారులు, వంతెనల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులు క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. ప్రతి జిల్లాలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్, సాగునీటి శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి రోజు క్షేత్రస్థాయి నివేదికలు సిద్ధం చేయాలని, జిల్లా ఇంజనీర్లతో రోజువారీగా మొబైల్ ఫోన్ ద్వారా సమీక్ష నిర్వహిస్తానని వెల్లడించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యలను వేగంగా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. ఇంజినీర్-ఇన్-చీఫ్ నుంచి సహాయ ఇంజనీర్ స్థాయి వరకు ప్రతి అధికారి పూర్తిస్థాయి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు.

# నిరుద్యోగుల మెరుపు ధర్నా

**మొదటి పేజీ తరువాయి**

బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ను ఆలస్యం చేయకుండా తక్షణమే నియామ కాల షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. ఆం దోళనలో పాల్గొన్న అభ్యర్థులు మాట్లాడుతూ, ఉద్యోగ నోటిఫికేషన్ల ఆలస్యమవడంతో తమ వయోపరిమితి దాటిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పోలీస్ నియామ కాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై స్పందించే రాహుల్ గాంధీ, తెలంగాణ నిరుద్యోగుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. వయోపరిమితి సడలింపు, జీవో 46, జీవో 29లను రద్దు చేసేవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.అశోక్‌నగర్ ఎక్స్‌రోడ్స్, చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ ప్రాంగణంలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను నిరోధించారు. నిరసనకారులను బలవంతంగా లాగివేసి, ముందస్తు జాగ్రత్తగా పలువురు నిరుద్యోగ జేఏసీ నాయకులను, అభ్యర్థులను అరెస్ట్ చేసి పోలీస్ వాహనాల్లో సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీంతో ఆ ప్రాంతంలో కాసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

# వరదలపై మోదీ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

అందించేందుకు చేపడుతున్న చర్యలపై ఎంపీలు ప్రధానికి వివరించినట్లు సమాచారం. రహదారులు, వంతెనలు దెబ్బతిన డం, రాకపోకలకు అంతరాయం, పునరావాస చర్యలు, అవసర మైన మౌలిక సదుపాయాల పునరుద్ధరణ వంటి అంశాలు సమావేశంలో ప్రాధాన్యంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రెండు రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ వరదలతో ఏర్పడిన సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తుం దని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలు, అత్యవసర సేవల నిర్వహణలో కేంద్ర సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాలకు అండగా ఉంటాయని పేర్కొన్నారు.

# వేములవాడ బస్‌స్టేషన్‌కు కొత్త రూపు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని తెలిపారు. ఈ పథకం వల్ల మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరగడంతో పాటు ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. ఇప్పటివరకు 334.11 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి సుమారు రూ.11,668 కోట్ల మేర ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారని వెల్లడించారు. 1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ.1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు ప్రతిరోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని, రోజుకు దాదాపు 50 వేల మంది ప్రయాణికులు ఈ బస్‌స్టేషన్‌ను వినియోగిస్తున్నారని చెప్పారు. కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించామని, గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించినట్లు గుర్తు చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ప్రభుత్వం లాభాల బాట పట్టించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,600 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, సిబ్బంది నియామకాలు చేపట్టడంతో పాటు దాదాపు రూ.100 కోట్లతో బస్‌స్టేషన్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు సుమారు రూ.1,000 కోట్ల భవిష్య నిధి బకాయిలు, రూ.600 కోట్ల సీసీఎస్ బకాయిలు చెల్లించినట్లు వెల్లడించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అతిపెద్ద ప్రజారవాణా సంస్థగా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అందిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు రూ.1.62 కోట్లు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి. గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్వేత సంపాదకీయం

శుక్రవారం 31-7-2026

# ప్రతిపక్షంగా విఫలం అవుతున్న కాంగ్రెస్ !

ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ది పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్తలో ఉండడం దౌర్భాగ్యం.

పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు.

రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం. నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీఛార్జ్ షరామమాలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.



## ఓటరు జాబితా సవరణతో పథకాలకు సంబంధం లేదు

### ప్రజలు అనవసర అపోహలకు గురి కావద్దు

### ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్,జూలై30(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు మాత్రమేనని, ప్రభుత్వం పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు మరో నాలుగు రోజులు గడువు మాత్రమే ఉన్నందున ఆగస్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ ప్రక్రియ 100శాతం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 76శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం పూర్తయిందని, ఇందులో ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హుజూర్ నగర్, నర్సంపేట్, వర్ధన్నపేట్, పరకాల, బోద్ నియోజకవర్గాల్లో 100శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇందుకు సంబంధించిన అధికారులను సిఇఓ ప్రశంసించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, జిహెచ్ఎంసితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం లిం పట్టణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ ప్రక్రియపై సంబంధిత డిఇఒలు ప్రత్యేక దృష్టి సారించి డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజటలైజేషన్ చేయడంలో ఓటరు పేర్లను తప్పులు లేకుండా అప్ లోడ్ చేసేలా బిఎల్ఒలు, సూపర్ వైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇఆర్ఒ, ఎఇఆర్ఒలు దీనిపై సమీక్షించి తప్పులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ లో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఒలు, సూపర్ వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఇఓ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల రాష్నలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఓటర్లలో మరణించిన వారు, ఇల్లుమరిన వారి వివరాలు, అందుబాటులో లేని వారి జాబితాను సిద్ధంచేసేటప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బిఎల్ఎల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఇఆర్ఒ, ఎఇఆర్ఒ, బిఎల్ఒ స్థాయిలలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలను వీడియోగ్రాప్ చేసి డాక్యుమెంట్ చేయాలన్నారు. దాంతోపాటు విఐపి, వివిఐపిల ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు.

## విధి నిర్వహణలో భయానికి తావు లేదు

### నిజాయితీగా విద్యుక్త ధర్మం నిర్వహించండి

### సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర

న్యూఢిల్లీ,జూలై30(ఆర్ఎన్ఎ): సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తానని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్‌-ఆర్ఏఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ..

జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్ఏఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. అది తమ నిబంధనల్లో భాగమేనని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, ఏదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతారు.

కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీలో స్థిరపడే మీ కలలకు
Exxeella Immigration Servicesతో
శ్రీకారం!

ఉన్నత జీవితం... ప్రపంచ స్థాయి ఉద్యోగాలు... కుటుంబానికి భద్రమైన భవిష్యత్తు ఇప్పుడు మీ చేతుల్లోనే!

ప్రస్తుత కాలంలో అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు, మెరుగైన జీవన ప్రమాణాలు, పిల్లలకు నాణ్యమైన విద్య, ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలు మరియు కుటుంబానికి భద్రమైన భవిష్యత్తు కోసం వేలాది మంది కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాల్లో స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు.

Exxeella Immigration Services మీ విదేశీ కలలను సాకారం చేసుకునే విశ్వసనీయ భాగస్వామి. Canada PR, Australia PR, Germany Opportunity Card / Job Seeker Visa వంటి ప్రముఖ ఇమ్మిగ్రేషన్ అవకాశాలపై అనుభవజ్ఞులైన నిపుణుల మార్గదర్శకత్వంతో మీకు సరైన దారిని చూపిస్తుంది.

మీ విద్య, వయస్సు, పని అనుభవం, ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలు మరియు ప్రస్తుత ఇమ్మిగ్రేషన్ నిబంధనల ఆధారంగా మీ ప్రొఫైల్‌ను సమగ్రంగా విశ్లేషించి, మీకు అత్యంత అనుకూలమైన ఇమ్మిగ్రేషన్ మార్గాన్ని సూచిస్తాము. ప్రతి దశలో పారదర్శకమైన ప్రాసెస్, పూర్తి డాక్యుమెంటేషన్ సహాయం మరియు వ్యక్తిగత సలహాలతో మీ ప్రయాణాన్ని సులభతరం చేస్తాము.

Canada & Australia PR ద్వారా లభించే ప్రయోజనాలు
- అధిక జీతాలతో ఉద్యోగ అవకాశాలు
- Permanent Residency (PR) పొందే అవకాశం
- కుటుంబంతో కలిసి స్థిరపడే అవకాశం
- ప్రపంచ స్థాయి విద్య & ఆరోగ్య సేవలు
- భద్రమైన, ఉన్నత జీవన ప్రమాణాలు

Germany Opportunity Card ద్వారా
- జర్మనీలో ఉద్యోగ అన్వేషణకు అవకాశం
- యూరప్‌లో అంతర్జాతీయ కెరీర్ నిర్మించుకునే అవకాశం
- ప్రపంచ స్థాయి పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు

మీ విదేశీ ప్రయాణానికి సరైన ప్రారంభం --
Exxeella Immigration Services తోనే!
సరైన ప్రణాళిక, నిపుణుల మార్గదర్శకత్వం మరియు పారదర్శకమైన సేవలతో మీ ఇమ్మిగ్రేషన్ ప్రయాణాన్ని విజయవంతం చేసుకోండి.
ఈరోజే మీ అర్హతను తెలుసుకోండి!
- Call: 89779 44266
- WhatsApp: »»HI అని మెసేజ్ చేయండి
- Email: jahangirmd@exxeella.com



...సంప్రదించండి....
MD. JAHANGIR
Immigration Adviser
Exxeella Immigration Services
89779 44266
jahangirmd@exxeella.com



## అటవీ సంరక్షణపై మాజీ పీసీసీఎఫ్ పరేశ్ కుమార్ స్మృతిగ్రంథం ఆవిష్కరణ

హైదరాబాద్, జూలై 30

తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా గురువారం లోక్ భవన్‌లో మాజీ ప్రధాన ప్రధాన అటవీ సంరక్షణాధికారి మరియు అటవీ శాఖాధిపతి , పదవీ విరమణ చేసిన ఐఎఫ్ఎస్ అధికారి పరేశ్ కుమార్ శర్మ రచించిన "ఫుట్‌ప్రింట్స్ ఇన్ ది ఫారెస్ట్స్ -- మెమోయర్స్ ఆఫ్ ఎ ఫారెస్టర్" గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరేశ్ కుమార్ శర్మ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా అటవీ శాఖలో పనిచేసిన అనుభవాల ఆధారంగా ఈ పుస్తకాన్ని రచించానని తెలిపారు. అటవీ అధికారులు, సివిల్ సర్వెంట్లు, సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఇది మార్గదర్శకంగా ఉపయోగపడ ుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ అటవీ విధానం, భారతదేశ వాతావరణ మార్పు లక్ష్యాలకు అనుగుణంగా అటవీ సంరక్షణకు మరింత ప్రాధాన్యం కల్పించాలని, ఈ రంగానికి బడ్జెట్ కేటాయింపులను పెంచాలని విధాన నిర్ణేతలకు ఆయన విజ్ఞప్తి చేశారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఎస్ఆర్ఏఎస్ పబ్లిష్ సంస్థకు చెందిన సుప్రియా భాలే రావు, ప్రముఖ అటవీ నిపుణుడు, పదవీ విరమణ చేసిన ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ మనోరంజన్ భాంజా, సైకాలజీ కౌన్సిలర్ నేహా వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

హైదరాబాద్, జూలై 30

తెలంగాణ ఎగుమతుల వృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు ఎగుమతిదారుల సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల బలోపేతం, కొత్త అంతర్జాతీయ మార్కెట్ల అన్వేషణ, ఎగుమతులకు అనుకూల విధానాల అమలుపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (రాజ్మూజ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. పరిశ్రమలు, తయారీ రంగం, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఔషధ పరిశ్రమ, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు వంటి కీలక రంగాల నుంచి ఎగుమతులను పెంచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎగుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలో అగ్రగామి ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదైనట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు. వ్యవసాయ, ఉద్యానవన, కోళ్ల పరిశ్రమ ఉత్పత్తులు, కూరగాయల విత్తనాలు, ఎర్ర మిరప తదితర ఉత్పత్తుల ఎగుమతులకు రాష్ట్రంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింత విస్తరించేందుకు తెలంగాణలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు. అదేవిధంగా, రాష్ట్ర ఎగుమతుల వృద్ధిని మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వ విదేశీ వాణిజ్య మహానిర్దేశకుల కార్యాలయం తో సమన్వయాన్ని బలోపేతం చేయాలని సంజయ్ జాజు అధికారులకు సూచించారు.



## ఒబీసీ 11వ జాతీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

సూర్యాపేట, జూలై 31

బీసీలంతా ఐక్యంగా పోరాడి జనాభా నిష్పత్తి మేరకు రాజకీయ, సామాజిక, ఆర్థిక హక్కులు సాధించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల నర్సింహ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఓబీసీ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న బెంగళూరులో నిర్వహించనున్న ఒబీసీ 11వ జాతీయ మహాసభ వాల్ పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చలమల్ల నర్సింహ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి బీసీ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బీసీ నాయకులు ఈ మహాసభలో పాల్గొంటారని తెలిపారు. మహాసభలో జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, మహిళలకు కల్పించే 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు తగిన వాటా కల్పించేలా చర్యలు తీసుకోవాలని తదితర అంశాలపై తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన ఎనిమిది దశాబ్దాలైనా బీసీలకు తగిన రాజకీయ ప్రాధాన్యం లభించలేదని, ఎన్నికల సమయంలో మాత్రమే బీసీలను గుర్తించి, అనంతరం వారి హక్కులను విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. ఆగస్టు 7న బెంగళూరులో జరిగే జాతీయ మహాసభకు సూర్యాపేట జిల్లా నుంచి పెద్ద ఎత్తున బీసీ ప్రజలు తరలివచ్చి ఐక్యతను చాటుతూ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు బూర మన్సూర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి నారాయణ గౌడ్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు, తండ అంజయ్య గౌడ్, కందాల భాస్కర్, కోడి లింగ యాదవ్, యేలే సత్యనారాయణ, యేలుగురి రామ్మూర్తి గౌడ్, పూన్న వెంకన్న, బైరు విజయ్ కృష్ణ, బడుగు లక్ష్మీనారాయణ, భీమనపల్లి వెంకటేశ్వర్లు, కోడిదల రాంబాబు, బంటు నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలి

## మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, జూలై 30

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిఖని, పెద్దపల్లి, సింగరేణి బొగ్గు గని ప్రాంతాల్లోని పలు నివాస కాలనీలు జలమయమైన నేపథ్యంలో వరద సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి, పెద్దపల్లి జిల్లా కలెక్టర్, సింగరేణి కాలరీస్ కంపెనీ (ఎస్‌సీసీఎల్) సీఎండీ, ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తెలంగాణ జెన్‌కో సీఎండీ, రామ గుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) అధికారులు, రామగుండం పోలీస్ కమిషనర్ తదితర ఉన్నతాధికారులతో కలిసి వరద పరిస్థితిని సమీక్షించారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట వెంకటరమ ణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. రామగుండం పారిశ్రామి క ప్రాంతంలో నిల్వ నీరు వేగంగా బయటకు వెళ్లేలా డ్రైనేజీ కాలువల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని మంత్రి ఆదేశించారు. సహాయక చర్యల్లో సింగరేణి, ఎన్‌టీపీసీ సంస్థలు చురుకుగా పాల్గొని జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. వీర్లపల్లి గ్రామంలోని నివాస ప్రాంతాలు ముంపునకు గురైన పరిస్థితిని సమీక్షించిన మంత్రి, ప్రత్యామ్నాయ మార్గం ద్వారా వరద నీటిని మళ్లించి గ్రామంలోకి మరింత నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా ఇంటి స్థలాల పట్టాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. గోదావరిఖనిలో తీవ్ర వరద పరిస్థితుల దృష్ట్యా సహాయక చర్యల్లో మున్సిపల్, రెవెన్యూ శాఖలకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందించా లని రామగుండం పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రధాన రహదారులపై రాకపోకలకు అంతరాయం కలగకుం డా చూడడంతో పాటు విపత్తు స్పందన బృందాలను వెంటనే రంగంలోకి దించాలని సూచించారు. భారీ వర్షాల వల్ల పెద్దపల్లి జిల్లాలోని మొత్తం 1,021 చెరువుల్లో సుమారు 80 శాతం నిండడం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. దీని వల్ల సుమారు 2.7 లక్షల ఎకరాలకు సాగునీటి అవసరాలు తీరనున్నాయని తెలిపారు. అలాగే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో గురువారం సాయంత్రానికి 20 టీఎంసీల నీటి నిల్వ చేరే అవకాశముందని పేర్కొంటూ, నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించి ఒక్క నీటి బొట్టు కూడా వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత వీర్లపల్లి గ్రామం, గోదావరి ఖని, రామగుండం పారిశ్రామిక ప్రాంతాల్లో సింగరేణి, జిల్లా వైద్యారోగ్య శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతి నిధులతో సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా పనిచేసి సహాయక చర్యల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.

# గుడిసెలు లేని తెలంగాణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: బల్మూరి వెంకట్

సూర్యాపేట, జూలై 30



అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను అందించి గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఏఐసీసీ సభ్యుడు రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్యతో కలిసి వారు మాట్లాడారు. దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలో కూడా ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో బీజేపీ కుట్రలకు పాల్పడే అవకాశం ఉందని, అందువల్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా తమ ఓటు హక్కు కోల్పోకుండా చూసే బాధ్యత అందరిదేనని పేర్కొన్నారు. ఈ ఉద్దేశంతోనే కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి వెళ్లి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ ప్రతి అర్హ ఓటరుతో నమోదు ప్రక్రియ పూర్తి చేయిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, కార్యకర్తలు నిత్యం ప్రజల మధ్య ఉండి ప్రతి ఓటు భద్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సూర్యాపేట కాంగ్రెస్‌కు కంచుకోట అని, ఏఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఒక్క ఓటు కూడా గల్లంతు కాకుండా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు సమర్థవంతంగా పని చేస్తున్నారని అభినందించా రు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల వంటి కార్యక్రమాల ద్వారా పేదలకు శాశ్వత గృహ వసతి కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మురిసెట్టి నివేదిత, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, శ్రీనివాస్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు తూముల సురేష్‌రావు, కోతి గోపాల్‌రెడ్డి, ముసుకు రామచంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఎస్ సంజయ్ జాజు

సూర్యాపేట, జూలై 30



రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. అన్ని జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌తో కలిసి భారీ వర్షాలు, వరద పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అధికారులందరూ తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు పనిచేసేలా చూడాలని సూచించారు. వర్షపాతం, జలాశయాల్లో నీటి నిల్వలు, దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ, ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే స్పందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేయాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని, వైద్యారోగ్య శాఖ అధికారులు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, నదుల పరిసర ప్రాంతాలకు ప్రజలు, పశుకాపరులు, మత్స్యకారులు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని చెప్పారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, ఆర్డీవో వేణుమాధవ్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగయ్య, డీసీహెచ్ఎస్ అధికారి చంద్రశేఖర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జీవో-25కు విరుద్ధమైన వర్క్ అడ్జస్ట్మెంట్లను రద్దు చేయాలి

జూలై 30



జిల్లాలో ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్మెంట్లను జీవో-25 నిబంధనలకు విరుద్ధంగా అమలు చేస్తున్నారని, అలాంటి అన్ని వర్క్ అడ్జస్ట్మెంట్లను వెంటనే రద్దు చేయాలని డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటీఎఫ్) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌కు అదనపు కలెక్టర్ హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్‌ల ద్వారా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డిటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రేపాక లింగయ్య, జిల్లా అధ్యక్షుడు షేక్ ఉమర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్వాయి బిక్షం మాట్లాడుతూ, ఎస్‌జీటీ ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలలకే వర్క్ అడ్జస్ట్మెంట్ చేయాల్సి ఉండగా, ఉన్నత పాఠశాలల్లో వారికి తెలియని సబ్జెక్టులను బోధించే విధంగా నియమించడం జీవో-25కు విరుద్ధమని పేర్కొన్నారు. దీనివల్ల విద్యార్థులకు నాణ్యమైన బోధన దెబ్బతింటుందని, ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎస్‌జీటీలను మినహాయించి ఇతర ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు పోస్టులకు వర్క్ అడ్జస్ట్మెంట్ చేసే సమయంలో జిల్లాను యూనిట్‌గా పరిగణించాలని కోరారు. ఒక మండలంలో అవసరమైన ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోతే పక్క మండలాల నుంచి, అక్కడ కూడా లేకపోతే జిల్లా వ్యాప్తంగా సర్దుబాటు చేయాలని సూచించారు. కేవలం మండల పరిమితికే పరిమితం కావడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పరస్పర (మ్యూచువల్) మరియు త్రికోణాకార వర్క్ అడ్జస్ట్మెంట్లకు అవకాశం ఇవ్వకూడదని, ప్రతి నెల ఉపాధ్యాయులు పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో ప్రతి నెల మొదటి తేదీకే ఖాళీలను సమీక్షించి, సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులను వెంటనే వర్క్ అడ్జస్ట్మెంట్ చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.



## చిలుకూరు పోలీస్ స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేసిన ఎస్పీ నరసింహ

**డోర్‌స్టెప్ ఎఫ్ఐఆర్‌తో ప్రజలకు వేగవంతమైన పోలీసు సేవలు**

**ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు పెట్రోలింగ్ -- వనమహోత్సవంలో మొక్కలు నాటాలని పిలుపు**

**చిలుకూరు, జూలై 30**

సూర్యాపేట జిల్లా పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ గురువారం చిలుకూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ రామకృష్ణా రెడ్డి, ఎస్ఐ బండి మోహన్ బాబు ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది గౌరవ వందనం పలికి ఎస్పీకి స్వాగతం పలికారు. తదనంతరం పోలీసు కవాతు, ఆయుధాలు, ఇతర సామగ్రి ప్రదర్శనను పరిశీలించిన ఎస్పీ, సిబ్బంది పనితీరు, స్టేషన్ నిర్వహణ, ప్రజా సేవలపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల పురోగతి, పెండింగ్ ఫిర్యాదులను పరిశీలించి ప్రజల ఫిర్యాదులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల తీరు, నేరాల నియంత్రణ చర్యలపై సమీక్షించిన ఎస్పీ, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించా ఓరు. మహిళలు, బాలబాలికలు, వెనుకబడిన వర్గాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తూ గస్తీని మరింత పటిష్ఠం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డోర్‌స్టెప్ ఎఫ్ఐఆర్ సేవల గురించి వివరిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేస్తే పోలీసు సిబ్బంది నేరుగా బాధితుల ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి, వెంటనే విచారణ ప్రారంభించి అవసరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా స్టేషన్ ఆవరణలో పోలీసు సిబ్బందితో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగు చేసే పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు. వాతావరణ అసమతుల్యతను అధిగమించేందుకు చెట్ల పెంపకం, అడవుల సంరక్షణ అత్య వసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిం చాలని పిలుపునిచ్చారు. చిలుకూరు మండలం వ్యవసాయా భివృద్ధిలో ముందున్న చైతన్యవంతమైన ప్రాంతమని పేర్కొన్న ఎస్పీ, పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి సంబంధించిన అంశాన్ని సంబంధిత అధికారులతో పాటు జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ రామకృష్ణా రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మగ్దూం అలీ, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ రాంబాబు, స్టోర్ ఆర్ఎస్ఐ అశోక్, ఎస్పీ సీసీ సందీప్, డీసీఆర్‌బీ సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, టెక్నికల్ టీం కానిస్టేబుల్ ఆబేద్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# లిఫ్టుల రక్షణ రైతుల బాధ్యత



**దొంగతనాలకు చెక్ పెట్టేందుకు పోలీసుల అవగాహన సదస్సు**

**సూర్యాపేట, జూలై 30**

వ్యవసాయానికి కీలకమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల భద్రత, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, వైర్లు, ఆయిల్ దొంగతనాల నివారణ లక్ష్యంగా సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గురువారం హుజూర్‌నగర్‌లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**రైతు కమిటీలు ఏర్పాటు చేయాలి: కలెక్టర్**

ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలలో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, వైర్లు, ఆయిల్ దొంగతనానికి గురైతే చివరికి రైతులే తీవ్రంగా నష్టపోతారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. దొంగతనాలు జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడం కంటే ముందే వాటిని అడ్డుకోవడమే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి లిఫ్ట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రైతులు కమిటీలు ఏర్పాటు చేసుకుని లిఫ్టులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతు కమిటీల ఏర్పాటుపై ప్రభుత్వం, ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగిస్తూ తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు. పెట్రోలింగ్ మరింత ముమ్మరం: ఎస్పీ నరసింహ రైతన్నల ఆస్తుల రక్షణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. జనావాసాలకు దూరంగా ఉన్న లిఫ్ట్ పథకాలనే లక్ష్యంగా చేసుకుని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, ఆయిల్‌ను అపహరిస్తున్నారని చెప్పారు. లిఫ్టుల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసి నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తామని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రైతులను కోరారు. రైతుల సహకారంతోనే దొంగతనాలను పూర్తిగా అరికట్టగలమన్నారు.

**లిఫ్టులను సొంత ఆస్తిగా కాపాడుకోవాలి: ఎమ్మెల్యే**

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను రైతులు తమ సొంత ఆస్తిగా భావించి సంరక్షించుకోవాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి పిలుపునిచ్చారు. లిఫ్టులలో దొంగతనాలు జరిగితే సాగునీటి సరఫరా దెబ్బతిని రైతులకే నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల కోసం ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ, పోలీసు శాఖలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి అవగాహన సదస్సు నిర్వహించిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని, ఎస్పీ నరసింహను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారా యణ, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ నాగభూషణం, విద్యుత్ శాఖ డీఈ రామ్మోహన్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ కవిత, ఇరిగేషన్, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులు, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిల చెల్లింపులకు చివరి విడతగా రూ.2,000 కోట్లు విడుదల

**హైదరాబాద్, జూలై 30**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన దీర్ఘకాలిక బకాయిల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం గురువారం మరో రూ.2,000 కోట్లను విడుదల చేసింది. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ నిధుల విడుదలకు అనుమతి ఇచ్చారు. ఈ చివరి విడతతో ప్రభుత్వం 100 రోజుల గడువులోగా మొత్తం రూ.6,000 కోట్ల బకాయిలను చెల్లిస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా అమలు చేసినట్లు వెల్లడించింది. ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)కి ఇచ్చిన హామీని పూర్తిగా నిలబెట్టుకున్నామని పేర్కొంది. తాజా నిధుల విడుదలతో పెన్షనర్ల కమ్యూటేషన్ బకాయిలన్నీ పూర్తిగా చెల్లించడంతో పాటు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిలు, ఇతర చిన్న మొత్తాల పెండింగ్ బిల్లులూ పూర్తిగా పరిష్కారమయ్యాయని తెలిపింది. మిగిలిన పరిపాలనా సంబంధిత ఆర్థిక బాధ్యతలను కూడా రానున్న రోజుల్లో దశలవారీగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఆర్థిక శాఖ వెల్లడించింది.



## అర్హత గల ఓటరికి ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ లక్ష్యం

**సూర్యాపేటలో పురోగతిపై సమీక్ష సమావేశం**

**సూర్యాపేట, జూలై 30**

సూర్యాపేట నియోజకవర్గంలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కుకు దూరం కాకుండా చూడటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రెడ్ హౌస్)లో గురువారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నల్లగొండ పార్లమెంట్ కో-ఆర్డినేటర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఏబీ శ్రీనివాస్, శ్రీనివాస్, పీసీసీ కో-ఆర్డినేటర్ అన్సారీ, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంలోని 271 బూత్‌ల పరిధిలో అర్హులైన ఓటర్లు ఎవరూ జాబితా నుంచి తప్పిపోకుండా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేశాయని తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటల నాటికి నమోదు ప్రక్రియ 99.27 శాతం పూర్తైందని చెప్పారు. ఈ విజయానికి కృషి చేసిన బూత్ లెవల్ ఏజెంట్లు బూత్ లెవల్ అధికారులు (దీూలు), బూత్ కోఆర్డినేటర్లు, మండల, పట్టణ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆయన అభినందించారు. ఇది కేవలం ఓటరు నమోదు కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యతను పార్టీ శ్రేణులు విజయవంతంగా నిర్వర్తించాయని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంలో ప్రక్రియ వేగంగా పూర్తవడానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి నాయకత్వం, పార్టీ శ్రేణుల సమన్వయం ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఇంకా నమోదు కాకుండా మిగిలిన అర్హులైన ఓటర్లను వెంటనే గుర్తించి ప్రక్రియ పూర్తి చేయాలని, ఒక్క ఓటరు కూడా రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కోల్పోకుండా అన్ని స్థాయిల నాయకులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, తూముల సురేష్ రావు, ముస్కు రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా ఇన్‌చార్జీలు, సూపర్‌వైజర్లు, సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## చెల్లుబాటు అయ్యే కొనుగోలు బిల్లులు లేకుండా నిల్వ చేసిన గర్భస్రావ కిట్లు స్వాధీనం

**నల్లగొండ, జూలై 30**

తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ మెడికల్ ఏజెన్సీస్‌పై దాడి నిర్వహించి, చెల్లుబాటు అయ్యే కొనుగోలు బిల్లులు లేకుండా నిల్వ ఉంచిన రూ.47,672 విలువైన 113 గర్భస్రావ (ఎంటీపీ) కిట్లను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టానికి విరుద్ధంగా మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) కిట్లను నిల్వ ఉంచినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మందుల నమూనాలను పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించామని, నివేదికల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు. చట్టవిరుద్ధంగా గర్భస్రావ కిట్ల విక్రయం లేదా నిల్వ చేయడం తీవ్రమైన నేరమని, ఇందుకు రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని డీసీఏ హెచ్చరించింది. మందుల అక్రమ విక్రయా లు, నకిలీ లేదా అనుమానాస్పద ఔషధ తయారీ, మత్తు మందులు మరియు సైకోట్రోపిక్ పదార్థాలకు సంబంధించిన చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని డీసీఏ కోరింది. ఇందుకోసం తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-6969కు పని దినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఫిర్యాదులు నమోదు చేయవచ్చని అధికారులు తెలిపారు.

## తెలంగాణ ఆర్కైవ్స్‌తో సాంస్కృతిక భాగస్వామ్యానికి తాజికిస్తాన్ ఆసక్తి

**హైదరాబాద్, జూలై 30**

భారత్--తాజికిస్తాన్ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్‌లో భద్రపరిచిన అరుదైన ప్రాచీన ప్రతులను (మాన్యుస్క్రిప్టులు) అనువదించడం, లిప్యంతరీకరణ చేయడం, ప్రచురించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని భారతదేశంలోని తాజికిస్తాన్ రాయబారి బోబోకలోం జోడా లుక్‌మోన్ ప్రతిపాదించారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్‌ను సందర్శించిన ఆయన, భారతదేశం అపారమైన జ్ఞాన సంపదకు నిలయ మని కొనియాడారు. రాష్ట్ర ఆర్కైవ్స్‌లో భద్రపరిచిన అరుదైన ప్రతులను తాజి క్ భాషలో అందుబాటులోకి తీసుకురా వాలనే ఆసక్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్ డైరెక్టర్ డాక్టర్ జరీనా పర్వీన్ అక్కడ భద్రపరిచిన అరుదైన పర్షియ న్ మాన్యుస్క్రిప్టులను రాయబారికి చూపించారు. అలాగే ఆర్కైవ్స్‌లో జరుగుతున్న డిజిటలైజేషన్ కార్యక్రమం పురోగతిని అధికారులు వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం భూగోళ శాస్త్ర విభాగం ప్రొఫెసర్ అక్తర్ అలీ రాయబారితో కలిసి ఈ సందర్శనలో పాల్గొన్నారు. ఆర్కైవ్స్ సహాయ సంచాలకుడు ఎం.ఏ. రఖీబ్ రాయబారికి స్వాగతం పలికి, రాష్ట్ర ఆర్కైవ్స్‌లో కొనసాగుతున్న డిజిటలైజేషన్ ప్రాజెక్టు వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు సంధ్యారాణి, జి. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రతి వార్డులో సమగ్ర అభివృద్ధే లక్ష్యం

**సూర్యాపేట, జూలై 30**

పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి తెలిపారు. సూర్యాపేట పట్టణంలోని 26వ వార్డులో మున్సిపాలిటీ నిధులతో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు గురువారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. వర్షాకాలంలో మురుగునీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారంగా సీసీ డ్రైన్ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీ ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల సహకారంతో సూర్యాపేటను మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, స్థానిక కౌన్సిలర్ పాలగాని మాధవి కృష్ణ, డి.ఈ. ప్రణయ్ రెడ్డి, నాయకులు పిల్లల రమేష్ నాయుడు, వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్, దండ అరవింద్ రెడ్డి, యాట ఉపేందర్, కోడి కృష్ణ, వరుణ్, శ్రీను, వార్డు జవాన్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



# తాటి బొత్తలెక్కే మా గౌడన్న ప్రోమో ఆవిష్కరణ

**మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరణ**

**గౌడ సంఘాల నాయకుల పాల్గొనడం**

**ఆగస్టు 9 కార్యక్రమానికి ఆహ్వానం**

**సర్దార్ పాపన్న, గౌతు లచ్చన్న జయంతి వేడుకలకు ఏర్పాట్లు**

హైదరాబాద్, జూలై 30

"తాటి బొత్తలెక్కే మా గౌడన్న" పాట ప్రోమోను మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల ప్రతినిధులు, సామాజిక నాయకులు, కళాకారులు పాల్గొన్నారు. గౌడ సమాజ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ పాట ప్రోమోను ఆవిష్కరించిన అనంతరం నిర్వాహకులను మాజీ మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో జై గౌడ సేన జాతీయ అధ్యక్షుడు గండి సుజన్ గౌడ్, మోర్ల ఏడుకొండల గౌడ్, అఖిల భారత గౌడ ఐక్యవేదిక కన్వీనర్ కోళ్ల ఈశ్వర్ ప్రసాద్ గౌడ్, రచయిత బాల సాయి గౌడ్, రవి ఉట్కూరి, పగిండ్ల మురళి, ఇంద్రకంటి వంశీ తదితరులు పాల్గొన్నారు. గౌడ సమాజ చరిత్ర, వారసత్వాన్ని యువతకు చేరవేసే ప్రయత్నాలను వారు అభినందించారు. పాట ప్రోమో ఆవిష్కరణ సందర్భంగా గౌడ సమాజ ఐక్యత, సామాజిక చైతన్యం, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు సమాజ చరిత్రను భావితరాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం జై గౌడ సేన జాతీయ సంఘం ప్రతినిధులు మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆగస్టు 9న విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి ఆహ్వానించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్, సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడలో జరిగే కార్యక్రమంలో బహుజన సర్దార్ల జెండా ఆవిష్కరణతో పాటు ఉచిత జెండాల పంపిణీ చేపట్టనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గౌడ సమాజ సభ్యులు హాజరుకానున్నట్లు తెలిపారు. సామాజిక చైతన్యం, చారిత్రక వారసత్వ పరిరక్షణ, బహుజన నాయకుల సేవలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆగస్టు 9న విజయవాడలో జరిగే జయంతి వేడుకలను విజయవంతం చేయడానికి సమాజ సభ్యులందరూ పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు.

# సంతకాల సేకరణలో 10 వేల మైలురాయి





## ఢిల్లీ దిశగా రైల్వే సాధన సమితి అడుగులు

సూర్యాపేట, జూలై 30

సూర్యాపేటకు రైల్వే మార్గం సాధించాలనే లక్ష్యంతో సాగుతు న్న ఉద్యమంలో మరో కీలక మైలురాయిగా రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సుడిగాలి పర్యటన ఘన విజయం సాధించింది. విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాన్ని చైతన్యపరు స్తూ నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్ర మం విజయవంతంగా పూర్తికాగా, మొత్తం 10 వేల సంతకాల లక్ష్యాన్ని చేరుకోవ డం ఉద్యమానికి కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఉదయం నవోదయ పాఠశాల నుంచి ప్రారంభ మైన ఈ పర్యటన అనంతరం సిటీ టాలెంట్ స్కూల్, త్రివేణి స్కూల్, కాకతీయ స్కూల్, నారాయణ కళాశాల, సృజన స్కూల్‌లను సందర్శిం చింది. మధ్యాహ్నం సాహితీ స్కూల్, ఎంఎస్‌ఆర్ స్కూల్, మోడల్ స్కూల్‌లలో విద్యార్థులు, ఉపాధ్యాయులను కలిసి సూర్యాపే టకు రైల్వే మార్గం అవసరాన్ని వివరించారు. ఉద్యమానికి మద్దతుగా విద్యార్థు లు పెద్ద ఎత్తున సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యాసంస్థల కరస్పాం డెంట్లు మారం లింగారెడ్డి, ప్రకాష్ రెడ్డి, హరి, కొల్లు శ్రీనివాస్, ఉపేందర్ రావు తదితరులు రైల్వే ఉద్యమానికి తమ పూర్తి మద్దతు ప్రక టించారు. ప్రజా ప్రయోజనాల కోసం సాగుతున్న ఈ ఉద్యమంలో తాము కూడా భాగస్వాముల వుతామ ని హామీ ఇచ్చారు. 10 వేల సంతకా ల సేకరణ పూర్తికావ డంతో రైల్వే సాధన సమితి సభ్యుల్లో ఆనం దం వెల్లివిరిసింది. ప్రజల నుంచి లభి స్తున్న అపూర్వ స్పందన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తోందని నాయకులు పేర్కొన్నా రు. ఉద్యమాన్ని తదుపరి దశకు తీసుకెళ్లేం దుకు రైల్వే సాధన సమితి ఇప్పటికే కార్యాచరణను ప్రారం భించింది. మొదటి దశలో భారీ మానవహారం నిర్వహించి రైల్వే కోసం ప్రజల ఆకాంక్షను దేశ దృష్టికి తీసుకె ళ్లాలని సమితి నిర్ణయించింది. ఈ కార్యక్ర మంలో రైల్వే సాధన సమితి కన్వీనర్ డేగల జనార్ధన్, కో-కన్వీనర్ రాచూరి ప్రతాప్, ఉద్యమ కోఆర్డినేటర్ బిక్కుమళ్ల ఉపేందర్, సభ్యులు నల్ల పాటి అప్పారావు, కె. మంజుల, మారోజు కృష్ణ మూర్తి, అక్కినేపల్లి రాము, పోతరాజు నరసయ్య తదితరులు పాల్గొని వివిధ విద్యాసంస్థలను సందర్శిస్తూ ఉద్యమానికి మద్దతు కూడ గట్టారు."10 వేల సంతకాలు కేవలం సంఖ్య కాదు సూర్యాపేట ప్రజల రైల్వే ఆకాంక్షకు నిదర్శనం. ప్రజల సహకారంతో ఉద్యమాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్లి సూర్యాపేటకు రైల్వే సాధిం చే వరకు పోరాటం కొనసాగు తుంది" అని రైల్వే సాధన సమితి నాయకులు స్పష్టం చేశారు.



# టెలికాం ఆధారిత సైబర్ నేరాలపై ఉక్కుపాదం



**టీజీసీఎస్‌బీ--డాట్ ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం**

హైదరాబాద్, జూలై 30

టెలికాం సేవలను దుర్వినియోగం చేస్తూ జరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో , టెలికమ్యూనికేషన్స్ శాఖ (డాట్) సంయుక్తంగా చర్యలు ముమ్మరం చేశాయి. ఈ దిశగా వేగవం తమైన గుర్తింపు, సమర్థవం తమైన దర్యాప్తు, పౌరుల రక్షణ లక్ష్యంగా గురువా రం హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమన్వ య సమావేశం నిర్వహించారు. టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టెలికమ్యూ నికేషన్స్ శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరో, టెలి కాం సేవల సంస్థలు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు చెందిన ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. టెలిక మ్యూనికేషన్స్ శాఖ తరఫున డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (టెక్నాలజీ) కె. రాజశేఖ ర్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (సెక్యూరిటీ) హేమంత్ రాథ్వే హాజరయ్యారు. సమావేశంలో సిమ్ బాక్స్‌ల దుర్వినియో గం, సిమ్ కార్డుల ధృవీకరణ విధానాన్ని మరింత కట్టుదిట్టం చేయడం, ఒకే వ్యక్తికి మోసపూరితంగా అనేక సిమ్ కార్డులు జారీ కాకుండా నియంత్రించడం, సైబర్ నేరాలకు సంబంధించి అనుమానాస్పద మొబైల్ నంబర్లను వేగంగా గుర్తించే వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అంత ర్జాతీయ స్పూఫ్ కాల్స్, వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ ఆధారిత మోసాలు, టెలి కాం గుర్తింపును దాచిపెట్టి చేసే నేరాలు, ఫిషింగ్ లింకుల ద్వారా జరిగే మోసాలను అరికట్టేందుకు సాంకేతిక సహకారాన్ని మరింత విస్తరించాల్సిన అవసరాన్ని సమావే శం నొక్కిచెప్పింది. సైబర్ నేరాల దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించి ప్రజలను రక్షించేందుకు టెలికమ్యూని కేషన్స్ శాఖ, ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ , టెలి కాం మరియు ఇంటర్నెట్ సేవల సంస్థలు , చట్ట అమ లు సంస్థల మధ్య సమన్వయాన్ని మరిం త బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భం గా తెలంగాణ సైబర్ సెక్యూ రిటీ బ్యూరో ఆధు నిక సాంకే తిక పరిజ్ఞా నాన్ని వినియో గిస్తూ, వివిధ సంస్థల మధ్య సమన్వ యాన్ని పెం పొందిస్తూ, ముందస్తు వ్యూహాలతో టెలికాం ఆధారి త సైబర్ మోసా లు, కొత్త తరహా సైబర్ ముప్పులను సమర్థవంతంగా అరికట్టేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేసింది.



# మత్స్యకారులకు వాహనాల మంజూరు

ఆదిలాబాద్, జూలై 30

మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాల కింద ద్విచక్ర, త్రిచక్ర వాహనాల మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను గురువారం ఆదిలాబాద్‌లో నిర్వహించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా హాజరై ఎంపిక ప్రక్రియ ను పర్యవేక్షించారు. లబ్ధిదారుల ఎంపికను లక్కీ డ్రా విధానంలో పారదర్శకం గా నిర్వహించారు. అర్హులైన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేపట్టారు. ఎంపిక ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు అధికారులు తెలిపా రు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజ నాలు నిజమైన అర్హులకు అందేలా అన్ని చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. మత్స్యకారుల ఆదా యాన్ని పెంచడం, వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచడం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థ వంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

# బీసీల కోసం మాట్లాడుతున్న నాయకుడిని లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని ఆరోపణ

**సూర్యాపేటలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు నీరజ గౌడ్ విమర్శలు**

సూర్యాపేట, జూలై 30

బీసీల హక్కుల కోసం గొంతెత్తుతున్న బీసీ నాయకులను రాజకీయ కక్షతో లక్ష్యంగా చేసుకుని వేధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు నీరజ గౌడ్ ఆరోపించారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వజ్రా రైస్ ఇండస్ట్రీ వ్యవహారంలో వాస్తవాల కంటే రాజకీయ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. వజ్రా రైస్ ఇండస్ట్రీ విషయంలో ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా వివాదాన్ని సృష్టిస్తూ అధికారంలో ఉన్న అగ్రకుల ఆధిపత్య శక్తులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆమె అన్నారు. ఈ వ్యవహారంలో నిజానిజాలను ప్రజలు గమనించాలని కోరారు. వజ్రా రైస్ ఇండస్ట్రీలో అక్రమాలు జరిగాయని పోలీసులు కేసు నమోదు చేసిన తర్వాత సంబంధిత వ్యవహారంలో కోర్టు జోక్యం చేసుకుని, అనవసర వేధింపులకు పాల్పడవద్దని ఆదేశాలు ఇచ్చిందని ఆమె పేర్కొన్నారు. అయితే, ఆ ఆదేశాల అనంతరం కూడా మరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం వెనుక జానయ్యను ఎలాగైనా జైలుకు పంపాలనే కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. వజ్రా రైస్ ఇండస్ట్రీలో ఎలాంటి తప్పు నిరూపించలేకపోయిన తరువాత, పెన్‌పహాడ్ సమీపంలోని జేపీ రైస్ మిల్లు నుంచి ధాన్యం తీసుకున్నారనే పేరుతో మరో కేసు నమోదు చేశారని ఆమె విమర్శించారు. మొదటి ఫిర్యాదు చేసిన అదే అధికారి రెండో కేసుకు కూడా ఫిర్యాదుదారుగా ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. జేపీ రైస్ మిల్లు రెండేళ్ల క్రితమే మూతపడిందని, అలాంటి పరిస్థితిలో ఆ మిల్లుకు సంబంధించిన అంశాలను ఇప్పుడు వెలికి తీసి జానయ్యను ఇరికించే ప్రయత్నం చేయడం న్యాయసమ్మతం కాదని ఆమె అభిప్రాయపడ్డారు.

ధాన్యం కొనుగోలు, నిల్వలు లేదా ప్రభుత్వ ఒప్పందాలకు సంబంధించి బాధ్యత ఉంటే అది సంబంధిత మిల్లు యాజమాన్యంపై లేదా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న వ్యక్తులపైనే ఉంటుందని, సంబంధం లేని వ్యక్తులపై కేసులు నమోదు చేయడం చట్టబద్ధమైన విధానం కాదని ఆమె అన్నారు. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కోట్ల రూపాయల ధాన్యం వ్యవహారాన్ని సరిదిద్దుతామనే పేరుతో ప్రస్తుతం నడుస్తున్న రైస్ మిల్లులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆమె విమర్శలు గుప్పించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి,



రాజకీయంగా విభేదించే నాయకులను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల తరఫున నిరంతరం మాట్లాడుతున్న జానయ్యను కక్షపూరితంగా వేధించి జైలుకు పంపాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలించవని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీసీల రాజకీయ చైతన్యం పెరుగుతోందని, బీసీలు రాజ్యాధికారం వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్న ఆమె, అదే కొందరికి అసహనంగా మారిందన్నారు. బీసీ నాయకులను బెదిరిస్తే వెనక్కి తగ్గుతారని భావించడం పొరపాటేనని, అలాంటి ప్రయత్నాలు విఫలమ వుతాయని అన్నారు. బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం జరుగుతున్న ఉద్యమాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని, జానయ్యపై జరుగుతున్న చర్యలను రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు, ప్రజాసం ఘాలు, ప్రజలు ఖండించాలని నీరజ గౌడ్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వట్టె జానయ్య యాదవ్ అమ్మ వట్టె ఐలమ్మ, జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఏశబోయిన మల్లేశ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కొన్నె మంజుల, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు కవిత, పెన్ పహాడ్ మండల అధ్యక్షుడు ఆవుల అంజయ్య యాదవ్, ఆత్మకూర్ ఎస్ అధ్యక్షుడు బొల్లె సైదులు, సూర్యాపేట మండల అధ్యక్షుడు సోమగాని లింగస్వామి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కోల కరుణాకర్, నేలచర్ల మధు ప్రజాపతి, బోడపట్ల మధు, వాట్యాల శేఖర్, దీపమాల, సుమన్, చంప్లా, కాంటేకర్ రఘు మోహన్ , శ్రీదేవి, చింతకాయల జానయ్య, సాయి, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# క్రికెట్‌కు రహానె గుడ్‌బై



**అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు**

**ధన్యవాదాలు తెలుపుతూ బీసీసీఐ పోస్ట్**

**టెస్టుల్లో ఓటమి ఎరుగని కెప్టెన్‌గా రికార్డు**

భారత సీనియర్ బ్యాటర్, టెస్టుల్లో జట్టుకు చారిత్రక విజయాలు అందించిన అజింక్య రహానె అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు నేడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక భావోద్వేగ వీడియో ద్వారా ప్రకటించాడు. దీంతో దాదాపు రెండు దశాబ్దాల పాటు సాగిన ఆయన కెరీర్‌కు తెరపడింది.

**రహానె రిటైర్మెంట్ ప్రకటనపై బీసీసీఐ వెంటనే స్పందించి, ఆయన సేవలను కొనియాడింది. "ఒక అద్భుతమైన కెరీర్ ముగిసింది. భారత క్రికెట్‌కు మీరు అందించిన అపారమైన సేవలకు, చిరకాలం గుర్తుండిపోయే జ్ఞాపకాలకు ధన్యవాదాలు. మీ తదుపరి ప్రయాణానికి మా శుభాకాంక్షలు" అని బీసీసీఐ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేసింది.**

### కెప్టెన్‌గా చెరగని ముద్ర

బ్యాటర్‌గానే కాకుండా కెప్టెన్‌గా కూడా రహానె తనదైన ముద్ర వేశాడు. టెస్టుల్లో ఓటమి ఎరుగని కెప్టెన్‌గా ఆయనకు అరుదైన రికార్డు ఉంది. కనీసం ఐదు మ్యాచ్‌లకు నాయకత్వం వహించిన భారత కెప్టెన్లలో అత్యధిక విజయశాతం రహానెదే కావడం విశేషం. అతని సారథ్యంలో భారత్ నాలుగు టెస్టుల్లో గెలిచి, రెండింటిని డ్రా చేసుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై 2020-21లో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టును చారిత్రక విజేతగా నిలపడం అతని కెప్టెన్సీ కెరీర్‌లో మరుపురాని ఘట్టం. విరాట్ కోహ్లీ గైర్హాజరీలో జట్టును ముందుండి నడిపించిన రహానె, మెల్‌బోర్న్‌లో అద్భుత విజయాన్ని అందించాడు. ముఖ్యంగా గబ్బాలో ఆస్ట్రేలియాకు ఏళ్ల తరబడి ఉన్న ఓటమి ఎరుగని రికార్డుకు బ్రేక్ వేసి సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో పాటు 2017లో ధర్మశాలలో ఆస్ట్రేలియాపై, 2018లో అఫ్ఘనిస్థాన్‌పై కూడా జట్టును విజయపథంలో నడిపించాడు.

### మూడు ఫార్మాట్లలో గణాంకాలు

తన కెరీర్‌లో రహానే 85 టెస్టులు ఆడి 12 సెంచరీలు, 26 అర్ధ సెంచరీలతో కలిపి 5,077 పరుగులు చేశాడు. 90 వన్డేలలో 3 సెంచరీలు, 24 అర్ధ సెంచరీలతో 2,962 పరుగులు సాధించాడు. ఇక, 20 టీ20 మ్యాచ్‌లలో ఒక అర్ధ సెంచరీతో 375 పరుగులు చేశాడు. ఆటగాడిగా, నాయకుడిగా భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన రహానె రిటైర్మెంట్‌తో ఒక శకం ముగిసినట్లయింది.

### నా ఇష్టమైన బ్యాటింగ్ పార్టనర్‌వి: కోహ్లీ

అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు అన్నిరకాల




ఆటకు వీడ్కోలు పలికిన టీమిండియా వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానేకు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ అభినందనలు తెలియజేశాడు. తనకు అత్యంత ఇష్టమైన బ్యాటింగ్ పార్ట్‌నర్ రహానే అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురిపించాడు. రిటైర్మెంట్ తర్వాతి జీవితం మరింత సాఫీగా ముందుకు సాగాలని సోషల్ మీడియా వేదికగా కోహ్లీ పోస్ట్ పెట్టాడు. 'జింక్స్(రహానే).. నీ అద్భుతమైన కెరీర్‌కు అభినందనలు మిత్రమా. నువ్వు భారత క్రికెట్‌కు ఎంతో చేశావు. నీ ప్రయాణానికి నువ్వు చాలా గర్వపడవచ్చు. స్లిప్‌లో అత్యంత నమ్మకైమన ఫీల్డర్‌వి. నాకు అత్యంత ఇష్టమైన టెస్ట్ బ్యాటింగ్ పార్ట్‌నర్‌వి. నీకు ఎప్పుడూ అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా. ఆ దేవుడి ఆశీస్సులు నీకు ఉంటాయి.'అని విరాట్ కోహ్లీ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. రహానేతో కలిసి దిగిన మైదానంలోని ఫొటోను పంచుకున్నాడు. టెస్ట్‌ల్లో విరాట్ కోహ్లీకి డిప్యూటీగా అజింక్యా రహానే మూడేళ్లు వ్యవహరించాడు.

# నీరజ్ దూకుడు



**రోహిత్, యశ్‌వీర్‌తో కలిసి ఫైనల్‌కు.. జావెలిన్ ఫైనల్‌కు చేరిన నీరజ్ చోప్రా**

**రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్‌కూ అర్హత**

గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు జావెలిన్ త్రో విభాగంలో శుభారంభం లభించింది. ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రాతో పాటు రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్ ముగ్గురూ పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించారు. బలమైన గాలుల కారణంగా అథ్లెట్లకు త్రో విసరడం కష్టంగా మారినా, అత్యుత్తమ ప్రదర్శన చేసిన 12 మంది ఫైనల్‌కు చేరుకున్నారు.

శుక్రవారం జరిగే ఫైనల్లో ఈ ముగ్గురు భారత అథ్లెట్లు పతకాల కోసం పోటీ పడనున్నారు. ఈ అర్హత పోటీలో ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ దూరమైన 84 మీటర్లను ఏ అథ్లెట్ అందుకోలేకపోయాడు. నీరజ్ చోప్రా తన రెండో ప్రయత్నంలో 79.61 మీటర్లు విసిరి ఐదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాడు. అప్పటికే అర్హత ఖరారవడంతో చివరి ప్రయత్నాన్ని ఉపయోగించుకోలేదు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు విసిరి తొమ్మిదో స్థానంలో నిలిచాడు. యశ్‌వీర్ సింగ్ 78.36 మీటర్లుతో పదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. గతేడాది సెప్టెంబర్ నుంచి నీరజ్ చోప్రాను నడుము కింది భాగం గాయం వేధిస్తోంది. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ముందు ఈ గాయం కావడంతో అతను ఆశించిన స్థాయిలో రాణించలేక ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గాయం కారణంగా ఈ ఏడాది సీజన్‌ను కూడా ఆలస్యంగా ప్రారంభించాడు. జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో ఒక్కసారి మాత్రమే బరిలోకి దిగి 85.69 మీటర్లు విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు. అర్హత పోటీలో శ్రీలంక అథ్లెట్ రుమేశ్ పతిరాజే 82.84 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో అతని పేరిట ప్రపంచంలోనే అత్యుత్తమ త్రో 92.62 మీటర్లు ఉంది. గ్రెనడాకు చెందిన రెండుసార్ల ప్రపంచ ఛాంపియన్ అండర్సన్ పీటర్స్ 81.29 మీటర్లతో రెండో స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా అథ్లెట్ డౌ స్మిట్ 80.64 మీటర్లతో మూడో స్థానం దక్కించుకున్నాడు. ఇంగ్లండ్‌కు చెందిన బెన్ ఈస్ట్ నాలుగో స్థానంలో నిలవగా, ఆస్ట్రేలియా అథ్లెట్ కామెరాన్ మెక్‌ఎంటైర్ ఆరో స్థానంలో నిలిచాడు. పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శనగా 78.63 మీటర్లు విసిరి ఏడో స్థానంతో ఫైనల్‌కు చేరాడు. దీంతో శుక్రవారం జరిగే ఫైనల్లో నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్ మధ్య మరో ఆసక్తికర పోరు చూసే అవకాశం ఏర్పడింది.




## వన్డే వరల్డ్‌కప్ వేదికలు ఖరారు

క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. వచ్చే ఏడాది పురుషుల వన్డే ప్రపంచకప్ వేదికలను అంతర్జాతీయ క్రికెట్ మండలి ప్రకటించింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీని మొత్తంగా 12 నగరాల్లో నిర్వహించనుంది ఐసీసీ. అయితే.. సింహభాగం మ్యాచ్‌లు దక్షిణాఫ్రికాలోనే జరుగనున్నాయని ఐసీసీ గురువారం వెల్లడించింది. జింబాబ్వేలోని మూడు, నమీబియాలో ఒకేఒక నగరంలో ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడిస్తామని అత్యున్నత బోర్డు పేర్కొంది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ వేదికలు ఖరారయ్యాయి. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ మొత్తంగా 12 నగరాల్లో జరుగనుంది. ఆధునిక స్టేడియాల, మౌలిక వసతులు, ప్రేక్షకుల ఆదరణ.. ఈ మూడు విషయాలను దృష్టిలో పెట్టుకొని దక్షిణాఫ్రికాలోనే 8 సిటీలను ఎంపిక చేసింది ఐసీసీ. జింబాబ్వేలోని మూడు, నమీబియాలోని విండ్‌హోక్ నగరంలో ప్రపంచకప్ మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి.

## నాయకుడిగా ఎదిగేందుకే వైభవ్‌కు కెప్టెన్సీ!

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి దులీప్ ట్రోఫీ-2026లో ఈస్ట్‌జోన్ వైస్ కెప్టెన్సీ అప్పగించడం చర్చనీయాంశమైంది. ఇంత చిన్న వయసులో బాధ్యతలు ఇవ్వడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని ఈస్ట్‌జోన్ సెలెక్టర్, మాజీ రంజీ క్రికెటర్ ప్రవంజన్ వెల్లడించారు. భవిష్యత్‌లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే వైభవ్‌కు ఈ బాధ్యతలు ఇచ్చామని చెప్పారు. ఈస్ట్‌జోన్ జట్టుకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడని, వైభవ్‌ను కెప్టెన్‌గా నియమించలేదని ప్రవంజన్ స్పష్టం చేశారు. ఇషాన్ వికెట్‌కీపర్ కావడంతో మ్యాచ్‌లో ఎక్కువ సమయం మైదానంలో చురుగ్గా ఉంటాడని చెప్పారు.

## టెస్టు సారథిగా మళ్లీ జో రూట్

### హెడ్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్




ఇంగ్లండ్ టెస్టు క్రికెట్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. స్టార్ బ్యాటర్ జో రూట్ రెండోసారి టెస్టు జట్టు కెప్టెన్‌గా నియమితులయ్యాడు. అదే సమయంలో న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరైన స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను టెస్టు జట్టు హెడ్ కోచ్‌గా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఎంపిక చేసింది. ఈ మేరకు నేడు అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇటీవల మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం, టెస్టు హెడ్ కోచ్ పదవి నుంచి బ్రెండన్ మెకల్లమ్‌ను తొలగించడంతో ఈ కీలక నియామకాలు జరిగాయి. గతంలో 2017 నుంచి 2022 వరకు రూట్ 64 టెస్టుల్లో ఇంగ్లండ్‌కు సారథ్యం వహించాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ తాత్కాలిక కెప్టెన్‌గా జట్టును నడిపించాడు. టెస్టు క్రికెట్‌లో 14,000 పరుగులకు పైగా సాధించి, సచిన్ టెండూల్కర్ తర్వాత అత్యధిక పరుగుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ సందర్భంగా రూట్ మాట్లాడుతూ.. "మళ్లీ ఇంగ్లండ్ టెస్టు జట్టుకు కెప్టెన్‌గా ఎంపికవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇది కష్టమైన బాధ్యత అయినా, ఎంతో సంతృప్తినిస్తుంది. తర్వాతి తరం ఆటగాళ్లను ముందుకు నడిపించడానికి ఉత్సాహంగా ఉన్నాను" అని తెలిపాడు. ఫ్లెమింగ్‌ను ఆటపై అపారమైన పరిజ్ఞానం ఉన్న అద్భుతమైన నాయకుడిగా అభివర్ణించాడు. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకాన్ని ఈసీబీ మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ సమర్థించాడు. ఫ్లెమింగ్ ప్రపంచ క్రికెట్‌లో అత్యంత గౌరవనీయమైన కోచ్‌లలో ఒకరని, జట్టులోని ప్రతిభను ప్రపంచ స్థాయి ప్రదర్శనగా మార్చగలరని విశ్వాసం వ్యక్తం చేశాడు. ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. "ప్రస్తుత విజయాలతో పాటు జట్టుకు మధ్యకాలిక, దీర్ఘకాలిక భవిష్యత్తును అందించడమే లక్ష్యం. కెప్టెన్ జో రూట్‌తో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను.

## బ్లూ జెర్సీ.. హాకీ ఇండియా క్లారిటీ





భారత జాతీయ హాకీ జట్ల జెర్సీ రంగును సాంప్రదాయ నీలి రంగు నుంచి కాషాయ రంగుకు మార్చడంపై చెలరేగిన వివాదంపై హాకీ ఇండియా స్పందించింది. ఇది కేవలం సాంకేతిక అవసరాల దృష్ట్యా ఆటగాళ్లు, సహాయక సిబ్బంది సూచనల మేరకే తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేసింది. ఈ మార్పు వెనుక ఉన్న అసలు కారణాలను వివరిస్తూ ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. వచ్చే నెల నెదర్లాండ్స్, బెల్జియంలో జరగనున్న 2026 హాకీ ప్రపంచకప్‌లో పురుషుల, మహిళల జట్లు కాషాయ రంగు జెర్సీలతో బరిలోకి దిగుతాయని ఈ నెల 27న హాకీ ఇండియా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా భారత హాకీ మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా ఈ మార్పును ప్రశ్నించడంతో వివాదం మరింత పెద్దదైంది. ఈ వివాదంపై స్పందించిన హాకీ ఇండియా.. "అంతర్జాతీయ హాకీ పిచ్‌లు ఇప్పుడు ప్రామాణికంగా నీలి రంగు సింథటిక్ టర్ఫ్‌తో ఉంటున్నాయి. మన ఆటగాళ్లు ధరించే నీలి రంగు జెర్సీ ఈ టర్ఫ్‌లో కలిసిపోతోంది. దీనివల్ల మైదానంలో ఆటగాళ్లకు స్పష్టత లోపించి, ఆటపై ప్రభావం పడుతోంది. ఈ సాంకేతిక సమస్యను అధిగమించేందుకే జెర్సీ రంగు మార్చాలని నిర్ణయించాం" అని తన ప్రకటనలో పేర్కొంది. ఆటగాళ్లు, కోచ్‌లతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది. మరోవైపు మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో.. "భారత హాకీకి నీలి రంగు అనేది గర్వకారణం, గుర్తింపు, వారసత్వం" అని అన్నారు. ఆయన పోస్ట్ వైరల్ కావడంతో చర్చ మొదలైంది. అయితే, తన పోస్టుకు అనవసరంగా రాజకీయ రంగు పులుముతున్నారని ఆయన ఆ తర్వాత ఆవేదన వ్యక్తం చేశారు. ఆటగాళ్లు, కోచ్‌లు పసుపు లేదా కాషాయం రంగును ప్రత్యామ్నాయంగా సూచించారని, మన జాతీయ జెండాలో కాషాయం రంగు ధైర్యానికి, త్యాగానికి, జాతీయ గౌరవానికి ప్రతీక కావడంతో దానిని ఖరారు చేశామని హాకీ ఇండియా తెలిపింది. జెర్సీ రంగును మార్చడం ఇదే మొదటిసారి కాదని కూడా గుర్తు చేసింది. "2014 ప్రపంచకప్‌లో జట్టు జెర్సీని పసుపు రంగులోకి, 2018 ప్రపంచకప్‌లో స్కై బ్లూ రంగులోకి మార్చాం. కార్యాచరణ అవసరాల మేరకు గతంలోనూ ఇలాంటి మార్పులు జరిగాయి" అని వివరించింది. సాంకేతిక అవసరాలు, జాతీయ భావన రెండింటినీ పరిగణనలోకి తీసుకుని ఈ మార్పు చేసినట్లు హాకీ ఇండియా స్పష్టం చేసింది.



# చిరంజీవి పుట్టినరోజుకు విశ్వంభర భారీ అప్‌డేట్!

**మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అభిమానులు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించారు. ఆగస్టు 22న జరగనున్న చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన నటిస్తున్న ప్రతిష్టాత్మక సోషియో--ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి కీలక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.**

దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఎక్కువగా ఉండటంతో విడుదల ఆలస్యమైంది. ప్రస్తుతం చిత్రీకరణ అనంతర పనులు తుదిదశకు చేరుకున్నట్లు సమాచారం. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ చిత్రాన్ని దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం ప్రణాళిక రూపొందించినట్లు సినీ వర్గాల సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే 'విశ్వంభర' విడుదలకు ఒక రోజు ముందే సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్--2' విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు కూడా వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో దసరా సందర్భంగా రెండు భారీ చిత్రాలు ఒకేసారి బరిలోకి దిగితే బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే విడుదల తేదీలు, ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాలపై చిత్రబృందాల నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.







## కథానాయికగా గుర్తింపు దక్కని
# కేథరిన్ థెరిసా

**మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన కేథరిన్ థెరిసా, ఆ తర్వాత సినీ రంగంలోకి అడుగుపెట్టి తక్కువ సమయంలోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇద్దరమ్మాయిలతో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, తొలి చిత్రంలోనే తన అందం, నటనతో మంచి గుర్తింపు సంపాదించింది. సినిమా ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, కేథరిన్‌కు మాత్రం వరుస అవకాశాలు లభించాయి.**

తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లోనూ నటించిన కేథరిన్, పలువురు అగ్ర హీరోల సరసన నటించినప్పటికీ ప్రధాన కథానాయికగా నిలిచే స్థాయి విజయాలు మాత్రం దక్కలేదు. దీంతో కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలతో పాటు ద్వితీయ కథానాయిక పాత్రలను కూడా అంగీకరిస్తూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగించింది. అల్లు అర్జున్ నటించిన 'సరైనోడు' చిత్రంలో ద్వితీయ కథానాయికగా నటించిన కేథరిన్‌కు ఆ సినిమా ఘన విజయం తీసుకొచ్చింది. అలాగే రానా దగ్గుబాటి నటించిన 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రంలోనూ కీలక పాత్ర పోషించి ప్రశంసలు అందుకుంది. అనంతరం కళ్యాణ్‌రామ్ నటించిన 'బింబిసార' చిత్రంలోనూ మరో కథానాయికగా నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

## 'శ్రీనివాస మంగాపురం'
# ఓటీటీ హక్కులు ప్రైమ్‌కే

సూపర్‌స్టార్ కృష్ణ కుటుంబం నుంచి హీరోగా పరిచయమైన ఘట్టమనేని జయకృష్ణ నటించిన తొలి చిత్రం 'శ్రీనివాస మంగాపురం' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మహేష్‌బాబు అన్న, దివంగత నటుడు రమేష్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా నటించడంతో ఈ చిత్రంపై మొదటి నుంచే ప్రత్యేక ఆసక్తి నెలకొంది. దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రాషా తడాని కథానాయికగా నటించారు. అశ్వినీదత్ సమర్పణలో 'చందమామ కథలు' పతాకంపై జెమినీ కిరణ్ నిర్మించిన ఈ చిత్రం జూలై 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ ప్రసార హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని చిత్ర ప్రారంభ శీర్షికల్లోనే చిత్రబృందం వెల్లడించింది. దీంతో థియేటర్లలో సినిమా చూసిన తర్వాత ఓటీటీలో ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా అని ఎదురుచూస్తున్న ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, థియేటర్లలో విడుదలైన సుమారు నాలుగు వారాల తర్వాత ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారమయ్యే అవకాశం ఉంది. అయితే ప్రసార తేదీపై చిత్రబృందం లేదా ఓటీటీ సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. థియేటర్లలో సినిమా ప్రదర్శన, వసూళ్లను బట్టి తేదీని ప్రకటించే అవకాశం ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. జయకృష్ణ తొలి చిత్రం కావడం, అజయ్ భూపతి దర్శకత్వం వహించడం, రాషా తడాని కథానాయికగా నటించడం వంటి అంశాలు ఈ సినిమాపై ప్రత్యేక ఆసక్తిని పెంచాయి. భావోద్వేగభరితమైన కథనం, ఆకట్టుకునే దృశ్యాలు, సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలాలుగా నిలుస్తాయని చిత్రబృందం తెలిపింది. ఇటీవలి కాలంలో తెలుగు చిత్రాలకు థియేటర్లతో పాటు ఓటీటీ వేదికల్లోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో 'శ్రీనివాస మంగాపురం' కూడా థియేటర్లలో తన ప్రదర్శన పూర్తైన తర్వాత అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా మరింత విస్తృత ప్రేక్షకులను చేరుకునే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.






# 'ప్యారడైజ్'కు జాన్వీ దూరం
## కాయదు లోహర్‌కు అవకాశం

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ప్యారడైజ్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' విజయవంతమైన తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నాని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న రెండో చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది.

**'దసరా', 'హాయ్ నాన్న', 'సరిపోదా శనివారం' విజయాల తర్వాత నాని మరోసారి విభిన్న కథతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ చిత్రంలో ప్రముఖ నటుడు మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తుండగా, సంపూర్ణేష్ బాబు కూడా మరో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు.**

ఈ చిత్రంలో కథానాయికగా ప్రస్తుతం కాయదు లోహర్ నటిస్తున్నారు. అయితే తొలుత ఈ పాత్ర కోసం బాలీవుడ్ నటి జాన్వీ కపూర్‌ను సంప్రదించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఇతర చిత్రాలతో బిజీగా ఉండటంతో తేదీలు సర్దుబాటు కాకపోవడంతో ఆమె ఈ చిత్రాన్ని అంగీకరించలేదని సమాచారం. దీంతో ఆ పాత్రకు కాయదు లోహర్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.



# అభిమానికి అండగా వరుణ్ తేజ్

**మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న అభిమానికి మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకొచ్చి మానవత్వాన్ని చాటారు. ఈ విషయం తెలిసిన తర్వాత అభిమానులు సోషల్ మీడియాలో వరుణ్ తేజ్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.**

అనంతపురం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు, గుత్తి పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్ పాటిల్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నారని తెలుసుకున్న వరుణ్ తేజ్ వెంటనే స్పందించారు. తన తల్లి పద్మజ సహకారంతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో సెంటర్ వైద్యులను సంప్రదించి, ఆయనకు అత్యుత్తమ వైద్యం అందేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు, ఆసుపత్రిలో సురేష్ పాటిల్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించారు. చికిత్సకు అయ్యే మొత్తం వైద్య ఖర్చును వరుణ్ తేజ్ స్వయంగా భరించినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. సురేష్ పాటిల్ పూర్తిగా కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అండగా నిలిచినట్లు సమాచారం.

# మళ్లీ తెరపైకి ముక్త భరణి

**ఒకప్పుడు తమిళ, మలయాళ చిత్రాల్లో తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి ముక్త మరోసారి వార్తల్లో నిలిచారు. హీరో విశాల్ నటించిన 'భరణి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు కూడా పరిచయమైన ఆమె, చాలా కాలం తర్వాత మళ్లీ సినిమాల్లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. మలయాళ చిత్ర పరిశ్రమలో కథానాయికగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ముక్త, తక్కువ సంఖ్యలో సినిమాల్లో నటించినప్పటికీ మంచి గుర్తింపు సంపాదించారు. తమిళంలోనూ పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని పొందారు. తెలుగులో ఆమె నటించిన చిత్రం 'ఫోటో'. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో తెలుగు చిత్రాల్లో ఆమెకు పెద్దగా అవకాశాలు రాలేదు.**

తరువాత తమిళ, మలయాళ భాషల్లో కొన్ని చిత్రాల్లో నటించిన ముక్త, వివాహం అనంతరం సినీ రంగానికి దూరమయ్యారు. 2015లో గాయకురాలు రిమి టోనీ సోదరుడు రింకు టోమీని వివాహం చేసుకున్న ఆమె కుటుంబ జీవితానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండే ముక్త తరచూ తన కుటుంబానికి సంబంధించిన చిత్రాలను అభిమానులతో పంచుకుంటుంటారు. ఆమె కుమార్తె కూడా బాలనటిగా తెరపై కనిపించడం విశేషం. ఇన్నాళ్ల విరామం తర్వాత ముక్త ఇప్పుడు 'కురువై పాప' చిత్రంతో మళ్లీ సినీ రంగంలోకి అడుగుపెడు తున్నారు.



"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467